అప్పటికప్పుడే లివియథాన్ ప్రభువు ప్రభ్వీతో వారి ప్రోజెనీతో అందరూ బోంబేమెయిల్ ఎక్కేసి—చల్! చల్! చల్! స్టీమర్ డెక్ మీద తొక్కేసి టక్! టక్! టక్! మరిన్ని దేవుడుమేలుచేస్తే లండన్‌నుండి బంగ్లయ్యకు కేబిల్—గుడ్ లక్! లక్! లక్!

.... .... .... .... ....

## ఎఱ్ఱకలువ చేతులూ - నల్లకలువ ముఖమూ

"యు ఆర్ డిశ్చార్జిడు ఫ్రమ్ దిస్ మోమెంట్" ఈ నివేశం తమకు వెళ్ళిపోవాలని వుంటే, వెళ్ళిపోవచ్చు హాస్పిటాల్లోంచి; మీజబ్బు కుదిరింది, మీరు కులాసాగా నున్నారు. ఇదిగో! పెద్ద దొరగారి ఉత్తరువు" అని తాఖీదు చూపించింది, అత్యుత్సాహంగా కళ్ళల్లో నవ్వు పెదవులమీదా ముక్కుకొనమీదా మెఱసేలా ఆ కోమలాంగి. కోమలాంగి అంటే నర్సు వీరవల్లి. పరాయిమనిషి కాదు. ఆమెచెప్పే ఆ వీడ్కోలు వాక్యాలు విని వేడుకపడ వచ్చునా? విశ్వసింగు మహదేవుకు వేడుకలేదు సరికదా విచారం పుట్టుకొచ్చింది.

అప్పటికి నెలరోజుల్నుండి ఆ హాస్పిటాల్లో స్పెషల్ వార్డు ఇన్‌పేషంటుగా వుంటూ, వీరవల్లి పెట్టిన రొట్టె, వీరవల్లి అందిచ్చిన పాలు, వీరవల్లి కొట్టిచ్చిన కోడిగ్రుడ్లు ఒకటేమిటి? ఆమె గ్రుచ్చిన సూదిమందుల దగ్గర్నుంచీ, డాక్టర్ సమక్ష మందు, డాక్టర్ పరోక్షమందూ కూడా తీసికొంటూ రోజూవారీగా

తేరుకొన్నాడు—అన్నాడు "ఇంటికంటె నాకీ హాస్పిటాల్లోనే బాగుంది. చించెయి ఆ విడుదల ఉత్తరువు. వీరవల్లి "మీ ఇల్లెక్కడ ?" వీరసింగు మహదేవుడు "ఇల్లూ లేదు వాళ్లూ లేదు ఈదాకా. నీ మూలంగా వాళ్లొచ్చింది. మఱి ఇల్లు ఎవరిమూలంగా వస్తుందో ? ఇంతకూ ఇల్లుండి ప్రయోజనం ఏమిటి ? పిల్లలుండాలి. ఒక్క పిల్లడైనా కలిగినా కంటిముందు త్రచ్చాడుతూ వుంటే బ్రతకగలను గాని లేకపోతే చావే శరణ్యం. ఏమంటావు నీ అభిప్రాయం ?" అని ఆమె కళ్ళల్లోకి యతిదీనంగా చూశాడు.

ఎందరెందర్నో వ్యాధిగ్రస్తుల్ని ఈసరికి వీరవల్లి నాడి చూచి, నరంసాచి తెలిసికొంది కాని, ఈలా తన కళ్ళల్లోకి ప్రాధేయపూర్వకంగా చూస్తూ తననే ఆధారంగా పరిగణించిన పురుషుణ్ణి ఆపె చూచియుండలేదు. అయినా యతగాడు కోరింది అదో పెద్ద కోరిక కాదు. ఒక్కకుఱ్ఱాణ్ణి తనకు ప్రసాదించమంటూ వున్నాడు. ఆలోచించింది వోలిప్త. ఆలోచించి "ఆలాగే, అందుకేమీ నీవు ఆందోళనపడనక్కరలేదు. నీవు మొదలింట బ్రహ్మచారివిలా గున్నావు. మరి ఇల్లెక్కడ" అంది. "ఎక్కడేమిటి ? తెల్లారేసరికి ఈ హాస్పిటాలుకు వెనుతట్టునవున్న మైదానమ్మీద రెండో స్వర్గంలాగ సాధిస్తాను" అన్నాడు వీరసింగు మహదేవ్. వాండ్లు ఇరువురూ పరస్పరం వీడ్కోలు గొన్నారు.

కథలో బిల్డింగ్ లేవడం కష్టమేమో గాని ఈ రోజుల్లో అవతల యసలు మైదానమ్మీద యతిసుఖవు మహాసుఖవూను. ఎటామిక్ ఎనర్జీతోటి లేచిపోయినాయి స్తంభాలు, దూలాలు, కొమర్లు, గొళ్ళాలు, కావలసినన్ని గదులు, పోలేనన్ని త్రోవలు,

లిప్టులు, స్విచ్చులు, పిల్లోలు, పుళ్ళేలు—అంతా అధునాతన రసాయన పదార్థవిజ్ఞానశాస్త్ర వృక్షజంతుశాస్త్ర, తాత్విక ఆర్థిక, సాంఘిక రాజకీయ సాముదాయక సూత్రాల ననుసరించి వీరసింగ్ మహదేవ్ మహల్ పెద్ద పాలెస్ తయారైంది. వీరవల్లి తన హాస్పిటాల్ డ్యూటీస్ నెరవేర్చిన అనంతరపు గడియలయొక్క విలాస వినోదాలన్నీ ఆ "వీడు" నందే. లోపల ఆమె ఏమేమి చేసేదో, వీరసింగ్ మహదేవు నెలా సంతోషపెట్టేదో బ్రహ్మ రహస్యం.

అయితే వీరసింగు మహదేవ్, తన కళ్లెదుట ఆమె చేస్తూవచ్చిన చేతల్లో ఒక సేవ దైనందిన నూతనంగాను యతి వినోదవంతంగాను చూచేవాడు; తన తలాపు దిక్కునే. మంచం ప్రక్క!

డయాగ్రామ్ గియ్యలేను గాని, అతి వయ్యారంగా నడిచేది యతని పడకగదిలో వీరవల్లి. ఇంటర్మిటెంట్ ఫీవర్ చార్టుగీతలా వంకర టింకర్లు పోతూ ఓ టెస్టుట్యూబ్‌లోకి అస్తమానం చూస్తూ వుండేది ఆపె. ఆమె దృష్టిలో తన దృష్టి కలుపుతూ వీరసింగ్ మహదేవు ఆ టెస్టుట్యూబ్‌లోకే చూస్తూ ఎవేవో రంగులొచ్చినట్టు పొంగువచ్చినట్టు, హృదయముప్పొంగినట్టు కనుగొంటూ ఉండేవాడు. ముట్టుకోవద్దు అని ఆజ్ఞాపించేది ఆపె, ఆ ముక్కతో తన కోరికలన్నీ కట్టిపెట్టేసుకు మంచంపట్టీమీద గడ్డంమోపుక ఊఁ ఆ గాజుపాత్రవంక చూచేవాడు. అప్పుడప్పుడు వీరవల్లి ఓ ఎఱ్ఱ కలువపువ్వో, ఓ నల్ల కలువపువ్వో ఆ టెస్టుట్యూబ్‌లోకి నీళ్లుపోసి తేలవేస్తూ ఉంటే తనూ వాకచేసి చూచేవాడు. నాలుగైదు కలవపువ్వులదాకా తేల్చి, పోల్చడాని

కవకాశంవున్న కైవారం గల పాత్ర అది. ఇలావుండగా ఓనాడు రాత్రి ఏంజరిగిందీ! వీరసింగు మహదేవ్ ఒక్కడే ఉన్నాడు ఇంటిలో! ఇల్లంతకూ వొక్కడే! అన్ని గొళ్ళాలు వేసేసి. లోపల గెడెట్టుకు, మరి కూర్కు కనబోతున్నాడు. ఇఖ నిశ్చింతగా! అట్టై! ఓ బేబీ! అంటే పిల్లవాడు! అంటే శిశువు! ఒకడు ఎఱ్ఱ కలువ చాయనో రెండు చేతులూ, నల్ల కలువ చాయనో ముఖమూ, టెస్టుట్యూబ్ పగల, విసరి, కేరుమన్నాడు! లోకంలోని కలలన్నీ వొక్కమారు కాంతిల్లి తేజరిల్లినట్టు, లోకంలోని తెలివిఅంతా కేంద్రీకరణమై ధ్వనించినట్టు !

వీరసింగు మహదేవ్ తక్షణం పాడ్ నుంచి ఒక లెటర్ పేపరు చించి, కుర్రాణ్ణి చూడకుండానే ఇలా వ్రాశాడు: "బొడ్డు కోయనక్కఱలేదు. పాలైనా ఇవ్వ నక్కఱలేదు. బిడ్డడు బాగానే ఉన్నాడు. నీవీ నిమిషమునుండి నా యింటికి రానవసరములేదు. యు ఆర్ డిస్చార్జిడు ఫ్రమ్ దిస్ మోమెంట్" అని వ్రాసి వెంటనే వీరవల్లి కందచేశాడు.

ఆ చీటీ యందుకుని యటుతర్వాత వీరవల్లి మిక్కిలి చింతించిందై తాను కనబోయే పిల్లవాడు వాడే యేమోనని, ఆ యింట్లోకి ఎలాగైనా వెళ్ళి ఆ పిల్లణ్ణి చూదామనుకుంది. కాని ఆ యింటి తలుపులు నాటికీ నేటికీ అభేద్యాలై ఊరుకున్నాయి!

.... .... ....

# అసలైన సిసలైన స్వేచ్ఛను అందుకోండి!

" అయిదువందల రూపాయలు ఖరీదు
చేసే ఆటవస్తువు కొన్నాను: చూసుకో"

అనిఅంటూ భర్త ఒకపేకేజీపెట్టై కూలివానినెత్తినుండి చావడిలో దించుతూ కూలివాణ్ణి పంపించివేసి వంటింటికేసి చూచాడు.